www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 226, గురువారం 17-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

**చెరువులా తలపిస్తున్న అప్రోచ్ రోడ్డు**



3లో..

**కామేపల్లి తహసిల్దార్ కార్యాలయంలో**

**సిబ్బంది కొరత ఏజెన్సీ గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**



8వ పేజీల్లో

# సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్

**సింగపూర్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ**

**తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్న సింగపూర్ బృందం**

**రాష్ట్రంలో అత్యాధునికి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్న ముఖ్యమంత్రి**

**సెమీకండక్టర్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తామని హామీ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16:**

భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# 22ఏ భూములపై గుడ్‌న్యూస్

## సీఎం రేవంత్ కీలక హామీలు



**22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించినట్లు సీఎం వెల్లడి**

**యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని ప్రకటన**

**పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని హామీ**

**పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తామని భరోసా**

**క్రమబద్ధీకరించిన, వేలం భూములకు 22ఏ నుంచి విముక్తి కల్పిస్తామన్న రేవంత్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**

22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో ..మిగతా 2లో

# దానం అనర్హతపై విచారణ వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**



ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటం పైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ పిటీషన్ ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదా వేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే ..మిగతా 2లో

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

**కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం.. 51 లక్షల మంది లబ్ది పొందే చాన్స్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 :**




దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ..మిగతా 2లో

# కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ

## ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి... అసెంబ్లీలో ప్రకటన

**30 రోజుల్లో నివేదిక: రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన**

**ఫాంహౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణ**

**నెల రోజుల్లో విచారణ పూర్తి చేయాలని అధికారులకు సూచన**

**ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతామని సీఎం ప్రకటన**

**కల్వకుంట్ల కుటుంబానికి 439 ఎకరాలు ఉన్నాయని వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ..మిగతా 2లో

**అక్టోబర్ 10 నుంచి 22 వరకు**

# దసరా సెలవులు

**తెలంగాణలో పాఠశాలలకు SA-1 పరీక్షల షెడ్యూల్ విడుదల**

**అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు**

2లో..

**వివిధ తరగతులకు వేర్వేరు సమయాల్లో పరీక్షల నిర్వహణ**

**ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా**

# ప్రభుత్వానికే అప్పగిస్తా

**అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్**

**తనతో పాటు పలువురి ఆస్తులపైనా సీబీఐ విచారణకు డిమాండ్**

**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి**

**గుంపు మేస్త్రీ, గుంటనక్క కలిసే ఉన్నారని కవిత విమర్శ**

**ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు ..మిగతా 2లో

# అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత!

## సౌదీకి హౌతీల మరో భారీ షాక్..!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:**

పశ్చిమాసియాలో సౌదీ అరేబియా-హౌతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హౌతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్-మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్ధంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హౌతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హౌతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హౌతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన ..మిగతా 2లో



# దానం అనర్హతపై విచారణ వాయిదా

**మొదటి పేజీ తరువాయి...**

దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, కే వివేక్‌రెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి



పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధారమని తమ వాదనల్లో స్పష్టం చేసారు. అదే విధంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమిత మైనవి కావని వాదించారు. పిటిషనర్ల వాదనలతో దానం నాగేందర్ న్యాయవాది వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎకడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్టు భావించరాదని వాదించారు. వాదనలు విన్న తరువాత ధర్మాసనం ఈ రోజు వెల్లడించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయ స్థానం నిర్ణయం తీసుకుంది.



## కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ..

**మొదటి పేజీ తరువాయి...**

ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తా

**మొదటి పేజీ తరువాయి...**

కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

### రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 16:**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## తిరుమలలో ఉచిత ఈవీ బస్సుల సేవలు ప్రారంభం

### ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు

**తిరుమల సెప్టెంబర్ 16:**

తిరుమల క్షేత్రంలో పర్యావరణ పరిరక్షణతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను అందించేందుకు సిద్ధం చేసిన ఉచిత ఈవీ బస్సుల సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల శుభసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను తిరుమలలో ఘనంగా ప్రారంభించారు. పర్యావరణహిత రవాణా కోసం రిలయన్స్ సంస్థ 25 ఎలక్ట్రిక్ బస్సులను అందించగా, బయోటెక్ సంస్థ 7 బస్సులను టీటీడీకి ఉచితంగా అందజేసింది. బస్సులతో పాటుగా 'జియో–బీపీ' సహకారంతో ప్రత్యేక ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్, ఇతర మౌలిక సదుపాయాలను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేసింది. గత జూన్ నెలలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ, తిరుమల కొండపై కాలుష్యాన్ని తగ్గించేందుకు టీటీడీకి రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా 25 ఈవీ బస్సులను విరాళంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బస్సులు కొండపైకి చేరుకుని నేడు భక్తుల సేవలకు అందుబాటులోకి వచ్చాయి. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు మాడ వీధులు, కాటేజీలు మరియు దర్శన క్యూలైన్ల వద్దకు ఉచితంగా చేరుకోవడానికి ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.



## 22ఏ భూములపై గుడ్‌న్యూస్

**మొదటి పేజీ తరువాయి...**

త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు.

## అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు

### తెలంగాణలో పాఠశాలలకు SA-1 పరీక్షల షెడ్యూల్ విడుదల

### అక్టోబర్ 1 నుంచి 9 వరకు సమ్మేటివ్-1 పరీక్షలు

### వివిధ తరగతులకు వేర్వేరు సమయాల్లో పరీక్షల నిర్వహణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 16:**

తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 (సా–1) పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవులను విద్యాశాఖ వెల్లడించింది. దీని ప్రకారం, అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సా–1 పరీక్షలు జరగనున్నాయి. అనంతరం అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో సౌలభ్యం కోసం తరగతుల వారీగా వేర్వేరు సమయాలను కేటాయించారు.

పరీక్షల సమయాల వివరాలు ఇలా ఉన్నాయి:

1 నుంచి 5వ తరగతి వరకు: విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

6, 8వ తరగతులకు: ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

7వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు

9వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు

10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

కాగా, తరగతుల వారీగా ఆయా సబ్జెక్టుల పరీక్ష తేదీలతో కూడిన పూర్తి స్థాయి కూడిన టైమ్ టేబుల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది.

## అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత!


**మొదటి పేజీ తరువాయి...**

చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హుతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది. యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్–15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హుతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హుతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హుతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హుతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

**మొదటి పేజీ తరువాయి...**

ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరఫున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పు లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.



ఓజోన్ పరిరక్షణపై మాట్లాడుతున్న ముఖ్య అతిథి.



సమావేశానికి హాజరైన విద్యార్థులు..

## ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

### లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 16:**

సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి భూమిపై ఉన్న జీవరాశులను కాపాడే ఓజోన్ పొరను రక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూ, వాతావరణ శాస్త్రాల కేంద్రం ఆచార్యులు జి. కిషోర్ కుమార్ పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. అనుపమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య కిషోర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉపరితలం నుంచి 15 నుండి 35 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఓజోన్ పొర సూర్యుని హానికర కిరణాలను పీల్చుకుని సహజ రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. శీతలీకరణ యంత్రాల నుంచి వెలువడే రసాయనాల వల్ల ఓజోన్ పొరకు నష్టం జరుగుతోందని వీటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వాయువులను, విద్యుత్ ఆదా చేసే పరికరాలను మాత్రమే వాడాలని సూచించారు. వాతావరణంలో పైపొరల్లో ఉండే ఓజోన్ మేలు చేస్తే మనం నివసించే భూమికి దగ్గరగా ఉండే పొరల్లో ఓజోన్ పెరిగితే అది వాయు కాలుష్యంగా మారి ఆరోగ్యాన్ని, పంటలను దెబ్బతీస్తుందని చెప్పారు. అడవుల నరికివేతను అరికట్టడం, మొక్కలు నాటడం, పునరుత్పాదక ఇంధన వనరులను వాడడం, ఒక్కసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్‌ను నిషేధించడం వంటి చర్యలు చేపట్టాలని వివరించారు. అనంతరం ఓజోన్ పొర కాపాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, సరిత, శ్రీకాంత్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, బాలన్న విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజాపురంలో ఆధ్యాత్మిక శోభ.. అంగరంగ వైభవంగా గణేష్ ఉత్సవాలు



**అన్నపురెడ్డిపల్లి, భద్రాద్రి (భద్రాద్రి న్యూస్)సెప్టెంబర్ 16 :** ?మండలంలోని రాజాపురం ఎస్సీ కాలనీలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. కాలనీ వాసులంతా ఏకమై ప్రతిష్ఠించిన గణనాథుడి మండపం నిత్య పూజలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పండుగ వాతావరణం ఉట్టిపడుతున్న ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం గణనాథుడికి వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. మహిళలు, చిన్నారులు, యువత ఉత్సాహంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటుండటంతో సాయంత్రం వేళల్లో మండపం భక్తులతో కిటకిటలాడుతోంది. కాలనీ యువకులు ప్రత్యేక శ్రద్ధతో మండపాన్ని విద్యుత్ కాంతులతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తుల కోసం ప్రతిరోజూ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామసమృద్ధి కోసం, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో వర్ధిల్లేలా భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఈ ఉత్సవాల్లో పాల్గొంటూ తమ ఐక్యతను చాటుతున్నారు. నిర్వాహకులు మరియు కాలనీ యువకుల సమన్వయంతో ఉత్సవాలు అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా కొనసాగుతుండటంతో గ్రామ ప్రజల మధ్య సోదరభావం మరింత బలపడుతోంది.

## ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు పరచలేదు

### – బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్ రెడ్డి



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** సిరుల మాగాని సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగు రాకేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం, కార్మికుల సంక్షేమం కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారన్నారు. కార్మికులకు మెడికల్ బోర్డు, కారుణ్య నియామకాలు, సొంతింటి కల, మెరుగైన వైద్య సదుపాయం వంటి సేవలను అందించారని గుర్తు చేశారు. అబద్ధపు హామీలతో అధికారులకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులను అరిగోశ పెడుతున్నాడని విమర్శించారు. నేటి వరకు కార్మికులకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో కార్మికులు అనేక రకాల జబ్బులతో బాధపడుతూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదన్నారు. వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరగబడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు కూసన వీరభద్రం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, మంతపురి రాజు గౌడ్, తొగురు రాజశేఖర్, సంకుబాన అనుదీప్, రాజేష్ రతన్ పాల్గొన్నారు.

## బూడిదగడ్డ మహాంకాళి ఆలయంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణంలోని బూడిదగడ్డ బస్తీలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ మహాంకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆశ్వీయుజ శుద్ధ ప్రతిపద నుంచి విజయదశమి వరకు 2026 అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. బూడిదగడ్డలోని శ్రీశ్రీశ్రీ మహాంకాళి అమ్మవారి దేవాలయం, శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత భాగ్యేశ్వర స్వామి పంచాయతన క్షేత్రం, శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవి క్షేత్రపాలిక అమ్మవారి ఆలయంగా భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు కేంద్రంగా కొనసాగుతోంది. ఆలయ చరిత్రను పరిశీలిస్తే, 1963లో పాశి కులస్తుల ఆధ్వర్యంలో మహాంకాళి అమ్మవారి ఆలయాన్ని నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం 1995 నుంచి శ్రీ నరేంద్ర భవాని స్వామి ఆధ్వర్యంలో ఆలయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అమ్మవారి శక్తి విశేషాలతో భక్తుల పాలిట కొంగు బంగారంగా, ఆరాధ్య దైవంగా ఆలయం వెలుగొందుతోందని తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలను ఈ ఏడాది కూడా భక్తుల సహాయ సహకారాలతో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్ణయించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని, తమ శక్తి మేరకు ధన, ద్రవ్య, వస్తు రూపంలో సహాయ సహకారాలు అందించి ఉత్సవాల నిర్వహణకు తోడ్పడాలని శ్రీ నరేంద్ర భవాని స్వామి కోరారు. భక్తుల సహకారంతో ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## నెల 19న కోదాడలో మెగా జాబ్ మేళా: యువతకు ఉద్యోగ బాటలు



**కోదాడ, సెప్టెంబర్ 16(భద్రాద్రి న్యూస్):** కోదాడ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 19న పట్టణంలోని సీసీ రెడ్డి విద్యా నిలయం ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు పులి వెంకటేశ్వర్లు తెలిపారు.రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళాలో సుమారు 200 నుండి 250 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ అర్హతలు గల అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారని వెల్లడించారు.నిరుద్యోగ యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఇంటర్వ్యూలకు పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యోగాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

# చెరువులా తలపిస్తున్న అప్రోచ్ రోడ్డు

- ఏడాది కూడా గడవకముందే సీసీ రోడ్డు దుస్థితి
- నాణ్యతపై కార్మికుల ఆందోళన



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** ప్రమాదాల నివారణ కోసం నిర్మించిన అప్రోచ్ రోడ్డు ఏడాది కూడా గడవకముందే అధ్వానంగా మారింది. సీసీ రోడ్డుపై కంకర బయటకు వచ్చి, చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి చెరువును తలపిస్తుండటంతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల నాణ్యతపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ప్రగతి మైదానం వద్ద విజయవాడ--జగదల్పూర్ జాతీయ రహదారి కలుస్తుంది. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో పలువురు మృత్యువాత పడగా, మరికొందరు క్షతగాత్రులయ్యారు. దీంతో ప్రమాదాల నివారణకు అప్రోచ్ రోడ్డు నిర్మాణమే పరిష్కారమని పోలీసులు, సింగరేణి అధికారులు నిర్ణయించారు. అప్పటి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శాలెం రాజు ఆదేశాల మేరకు సుమారు రూ.12 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులు పనులు చేపట్టారు. గత ఏడాది అక్టోబర్‌లో పనులు పూర్తయ్యాయి. అయితే ఏడాది కూడా పూర్తికాకముందే రోడ్డు దెబ్బతినడం పలు అనుమానాలకు తావిస్తోంది. సీసీ రోడ్డుపై కంకర బయటకు రావడం, వర్షపు నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయని కార్మికులు చెబుతున్నారు. నిర్మాణ సమయంలో సంబంధిత సివిల్ అధికారులు తగిన స్థాయిలో పర్యవేక్షించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వారు అభిప్రాయపడుతున్నారు. సిమెంటు, కంకర, ఇసుకను నిబంధనల ప్రకారం వినియోగించారా? లేదా? అనే అంశంపై పరిశీలన జరపాలని కోరుతున్నారు. ఈ పనులకు సంబంధించిన సిమెంటును 2025 నవంబర్ 6న కొత్తగూడెంలో అక్రమంగా తరలించి విక్రయిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సింగరేణి ప్రత్యేక బృందం స్వాధీనం చేసుకున్న ఘటనను కార్మికులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో ఉపయోగించిన సిమెంటు నాణ్యత, వినియోగంపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు ప్రమాదాల నివారణ కోసం నిర్మించిన అప్రోచ్ రోడ్డు ప్రస్తుతం వాహనదారులు, కార్మికులకు ఇబ్బందికరంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి రోడ్డు దుస్థితిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలతో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ప్రమాదాలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కులవృత్తికి రక్షణ.. నాయి బ్రాహ్మణులకు భరోసా!

- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ వృత్తిని కాపాడాలి
- కార్పొరేట్ సెలూన్లపై నియంత్రణ.. యువతకు ఉచిత శిక్షణ, సబ్సిడీ రుణాలు ఇవ్వాలి
- కులవృత్తిని కించపరిచే వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలి: తోటపల్లి రమణ

**చర్ల, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్):** చర్ల మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చర్ల మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం 500/82 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు నాయి బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటారు. ముందుగా కులదైవమైన ధన్వంతరి స్వామికి పూజలు నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. నాయి బ్రాహ్మణ నాయకురాలు పంబి కుమారి జ్యోతి ప్రజ్వలన చేయగా, జిల్లా నాయకులు గోరింట్ల వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులు తోటపల్లి మాధవరావు నాయి బ్రాహ్మణ జెండాను ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు తోటపల్లి రాంబాబు సభను ప్రారంభించారు.

**కులవృత్తి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరం**

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు తోటపల్లి రమణ మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణుల కులవృత్తి కేవలం జుట్టు కత్తిరించడం, గడ్డం చేయడం వరకే పరిమితం కాదన్నారు. పూర్వకాలం నుంచి గ్రామీణ సమాజంలో వ్యక్తిగత పరిశుభ్రత, అలంకరణతో పాటు వివాహాలు, నిశ్చితార్థాలు, పండుగలు, ఇతర శుభకార్యాల్లో నాయి బ్రాహ్మణులు కీలక సేవలు అందిస్తున్నారని తెలిపారు. తాతలు, తండ్రుల నుంచి పిల్లలకు వృత్తి నైపుణ్యాలను అందిస్తూ తరతరాలుగా ఈ సంప్రదాయ వృత్తిని కొనసాగిస్తున్నామని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తిని ఆధునీకరించడంతో పాటు వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

**కార్పొరేట్ సెలూన్లపై నియంత్రణ ఉండాలి**

నాయి బ్రాహ్మణుల సంప్రదాయ క్షౌరవృత్తిని ప్రభుత్వం గుర్తించి, భవిష్యత్ తరాలకు అందేలా ప్రత్యేక పరిరక్షణ చర్యలు చేపట్టాలని రమణ డిమాండ్ చేశారు. కార్పొరేట్ సెలూన్లకు సంబంధించి తగిన నిబంధనలు తీసుకురావడంతో పాటు నాయి బ్రాహ్మణుల వృత్తికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కులవృత్తిని, కులాన్ని కించపరిచేలా మాట్లాడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సెలూన్లు ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీ, తక్కువ వడ్డీ రుణాలు అందించాలని కోరారు.

**యువతకు ఆధునిక వృత్తి శిక్షణ ఇవ్వాలి**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక హెయిర్ సెలూన్లు, బ్యూటీ పార్లర్లు తదితర రంగాల్లో నాయి బ్రాహ్మణ యువతకు ఉచిత వృత్తి శిక్షణ అందించాలని నాయకులు కోరారు. స్వయం ఉపాధి పథకాలు, ఉపాధి అవకాశాలు కల్పించి యువత కులవృత్తిని కొనసాగించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

**వృత్తికి గౌరవం.. కుటుంబాలకు భద్రత**





నాయి బ్రాహ్మణుల కులవృత్తికి సామాజిక గౌరవం కల్పించడంతో పాటు వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కులవృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయమని పేర్కొన్నారు.శాసనసభల్లో నాయి బ్రాహ్మణుల సమస్యలపై బలంగా మాట్లాడే గొంతు ఉండేలా రాజకీయ ప్రాతినిధ్యానికి అవకాశాలు కల్పించాలని నాయకులు కోరారు.

**60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఘన సన్మానం**

కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు నాయి బ్రాహ్మణుల సమస్యలు, కులవృత్తి పరిరక్షణ, యువత భవిష్యత్ తదితర అంశాలపై ప్రసంగించారు. అనంతరం 60 సంవత్సరాలు దాటిన నాయి బ్రాహ్మణ వృద్ధులను ఘనంగా సన్మానించారు. తర్వాత నాయి బ్రాహ్మణుల నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం సంఘం ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో మండల కమిటీ గౌరవ సలహాదారు తోటపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కొండ్రు హరీష్, ప్రచార కార్యదర్శి గోరంట్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుంకర రాజేష్, కోశాధికారులు అయినవిల్లి శ్రీను, నేదునూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. నాయి బ్రాహ్మణ నాయకులు, సంఘ సభ్యులు, మహిళలు, యువత, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, కొత్తగూడెం ఆధ్వర్యంలో ప్రధాన పరిశ్రమల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాన్ని నవభారత్ వెండర్స్ లిమిటెడ్, పాల్వంచ ప్రాంగణంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వారు ఓజోన్ పొర ప్రాముఖ్యత, దాని పరదక్షిణ అవసరం మరియు పర్యావరణంపై ఓజోన్ క్షీణత వల్ల కలిగి ప్రభావాలపై వివిధ పరిశ్రమల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. భూమికి సుమారు 15–35 కిలోమీటర్ల ఎత్తులోని స్ట్రాటోస్పియర్లో అధిక సాంద్రతలో ఉండే ఓజోన్ పొర సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాలకు సహజ రక్షణ కవచంగా పనిచేస్తుందనీయు మరియు ముఖ్యంగా ఎల్బి–బి కిరణాల అధిక ప్రభావం నుంచి మానవులు, జంతువులు, మొక్కలు మరియు ఇతర జీవరాశులను రక్షించడంలో ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భూమిపై జీవరాశుల మనుగడకు ఓజోన్ పొర అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. ఓజోన్ పొర క్షీణించడం వల్ల భూమి ఉపరితలానికి చేరి యువి–బి కిరణాల పరిమాణం పెరిగి, మానవ ఆరోగ్యంతో పాటు పంటలు, మొక్కలు, సూక్ష్మజీవులు మరియు అల పర్యావరణ వ్యవస్థలపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. ఆహార గొలుసులు మరియు పర్యావరణ వ్యవస్థల పరిరక్షణలో కూడా ఓజోన్ పొర ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా 2026 ప్రపంచ ఓజోన్ దినేత్సవం »»Global Action for a Cooler Planet-Celebrating 10 years of sustainable cooling under the Kigali Amendment to the Montreal Protocol ఆనే ఇతివృత్తంతో నిర్వహించబడుతున్నట్లు వివరించారు. కిగాలీ సవరణ ద్వారా హెచ్ఎఫ్సి యు దశలవారీ దగ్గింపు, పర్యావరణహితమైన మరియు ఇంధన సామర్థ్యం కలిగిన శీతలీకరణ సాంకేతికలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు.. పరిశ్రమలు ఓజోన్ పొందు క్షీణింపజేసి పదార్థాల వినియోగాన్ని నియంపొంచుడం పర్యావరణహిత ప్రత్యామ్నాయ సాంకేతికతలను అచలాభించడం, శీతలీకరణ పరికరాల నిర్వహణలో పర్యావరణ ప్రమాణాలను పాటించడం మరియు ఇందన సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా ఓజోన్ పొర పరిరక్షణలో. తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. "ఓజోన్ పొరను కాపాడటం కంటే భూమిపై జీవరాశులను,




పర్యావరణ వ్యవస్థలను మరియు భవిష్యత్ తరాలను కాపాడటం" అనే సందేశాన్ని ఈ కార్యక్రమంలో ప్రధానంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నవభారత్ వెంచర్స్ లిమిటెడ్ ప్రతినిధులు, యస్ ప్రతినిధులు మరియు పరిసర ప్రాంతంలోని ప్రధాన పరిశ్రమల ప్రతినిధులు సుమారుగా 100 మంది పాల్గొనడం జరిగింది.

# వాజేడులో సీఎంఆర్ఎఫ్ చెక్కులు.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- ఏడుగురు లబ్ధిదారులకు రూ.1.97 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం.. 90 కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు

**వాజేడు, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్):** అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను చేరువ చేయడమే లక్ష్యంగా వాజేడులో



సీఎంఆర్ఎఫ్ చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. వాజేడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమాల్లో భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏడుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.1,97,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య సమస్యల నుంచి కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు:**

అల్లి చెన్నకేశవులు -- రూ.20,000, పంతులి రంజనమ్మ -- రూ.5,000, కాట్లపూడి వి.వి. సుబ్బారాయ్ -- రూ.60,000, చిత్తూరి శివరామలక్ష్మి -- రూ.12,000, చింతెముల సుజాత -- రూ.12,500, గానా నాగరాజు -- రూ.59,000, తాళ్లపల్లి దోసె -- రూ.29,000. అనంతరం ఎంపీడీవో కార్యాలయం వద్ద 90 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే అందజేశారు.



అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయడంలో భాగంగా లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పాయిగూడెం పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ

**- విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు.. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: సర్పంచ్ దండు ప్రవీణ్**



**కారేపల్లి, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంపీపీఎస్ అప్పాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే మంచి అలవాట్లు, క్రమశిక్షణ, విద్య పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనానికి అనుకూల వాతావరణం కల్పించేందుకు అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్యారాణి, బీఎఫ్టీ వసంత్, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గాదెపాడులో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

**– మురుగునీటి సమస్యకు పరిష్కారం.. విడతలవారీగా గ్రామమంతా ఏర్పాటు**

**– భూగర్భ జలాల పరిరక్షణే లక్ష్యం: సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్**



**కారేపల్లి, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** గ్రామాభివృద్ధిలో మరో ముందడుగు వేస్తూ కారేపల్లి మండలం గాదెపాడు గ్రామపంచాయతీలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. డ్రైనేజీ నీరు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేందుకు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పనులు ప్రారంభించారు. గ్రామంలో మురుగునీటి నిల్వతో ఏర్పడే ఇబ్బందులను తగ్గించడంతో పాటు వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల పరిరక్షణకు దోహదపడేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలిదశలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి పనులు ప్రారంభించగా.. విడతలవారీగా గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. గాదెపాడును పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంతో పాటు నీటి వనరులను కాపాడేలా గ్రామపంచాయతీ తరఫున చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో అవసరమైన ప్రతి ప్రాంతాన్ని గుర్తించి దశలవారీగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుతో డ్రైనేజీ నీరు రోడ్లపై నిలిచిపోకుండా భూమిలోకి ఇంకే అవకాశం ఉండటంతో పారిశుధ్య సమస్యలు తగ్గే అవకాశం ఉందని గ్రామపంచాయతీ ప్రతినిధులు తెలిపారు. గ్రామ పరిశుభ్రత, నీటి సంరక్షణకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్టీ ఏరియాలో ముమ్మరంగా పైప్‌లైన్ పనులు



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** రుద్రంపూర్ ఎస్ఆర్టీ ఏరియాలో పగిలిపోయిన తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులను సింగరేణి కొత్తగూడెం ఏరియా సివిల్ విభాగం అధికారులు ముమ్మరంగా చేపట్టారు. గత కొన్ని రోజులుగా పైప్‌లైన్ పగిలిపోవడంతో కాలనీల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన బీడ్ పైప్‌లైన్ చెట్లు పడటంతో పగిలిపోయినట్లు అధికారులు గుర్తించారు. సమస్యను పరిశీలించిన అనంతరం పగిలిన పైపులను తొలగించి, వాటి స్థానంలో జీడీపీ పైపులను అమర్చే పనులను కాంట్రాక్ట్ వాటర్ సప్లై కార్మికులతో ప్రారంభించారు. క్లిష్టతరమైన జాయింటింగ్ పనులను సైతం కార్మికులు సమయస్ఫూర్తితో చేపడుతూ నీటి సరఫరా పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. సివిల్ విభాగం ఈఈ సుమంత్, వాటర్ సప్లై సూపర్‌వైజర్ గూడెల్లి యాకయ్య ఆధ్వర్యంలో పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే నాల ఏరియా పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు పూర్తిచేసి నీటి సరఫరాను ప్రారంభించారు. ప్రస్తుతం గోపి ఏరియా కాలనీకి సంబంధించిన పైప్‌లైన్ పనులను చేపడుతున్నారు. సాయంత్రం నుంచి కాలనీకి నీటి సరఫరా పునరుద్ధరించడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. పగిలిన పైప్‌లైన్‌ను తొలగించి కొత్త పైపులను అమర్చడం, జాయింటింగ్ పనులు పూర్తిచేయడం వంటి క్లిష్టమైన పనులను వేగంగా చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించిన వాటర్ సప్లై కార్మికులకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

# భవనం పైనుండి జారిపడి మృతిచెందిన ఓ యువకుడు



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** బతుకుతెరువు కోసం పెయింటింగ్ పనులు చేసుకుంటున్న ఓ యువకుడు భవనం పైనుండి జారిపడి మృతిచెందిన ఘటన కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో మంగళవారం విషాదం నింపింది. అన్నపురెడ్డిపల్లి మండలం గుంపేటకు చెందిన పెనుమల సతీష్ పెళ్లైన ఆరు నెలలకే మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సతీష్ తన భార్యతో కలిసి కొత్తగూడెం హెడ్ ఆఫీస్ సమీపంలో అక్కా, బావల ఇంటి వద్ద ఉంటూ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం విద్యానగర్ కాలనీలోని రాయల్ బిల్డింగ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో పెయింటింగ్ పనులు చేస్తుండగా, తాడు తెగిపోవడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో సతీష్ అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. నిర్మాణ పనులు జరుగుతున్న భవనంలో కార్మికులకు కనీస భద్రతా పరికరాలు కల్పించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎత్తైన ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు సేఫ్టీ బెల్టులు, సేఫ్టీ నెట్లు, ఇతర రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచాల్సి ఉన్నప్పటికీ, కేవలం తాడుపైనే ఆధారపడి పనులు చేయించడం వల్లే ప్రమాదం జరిగిందని వారు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారి పక్కనే నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనానికి అనుమతులు ఉన్నాయా? నిర్మాణ నిబంధనలు పాటిస్తున్నారా? కార్మికుల భద్రతా ప్రమాణాలను అమలు చేస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తనిఖీల్లో నిర్లక్ష్యం జరిగిందా, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాల ఉల్లంఘన కారణంగానే సతీష్ మృతిచెందాడనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# విపత్తుల వేళ తక్షణ స్పందనకు యువ ఆపదమిత్రలు సిద్ధంగా ఉండాలి

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్**





**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపదమిత్రల పాత్ర కీలకం యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ సమయస్ఫూర్తి, మానసిక అప్రమత్తతతో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి విపత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపదమిత్రలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఆరవ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా 6వ బెటాలియన్‌కు చేరుకున్న కలెక్టర్‌కు బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... భౌగోళిక, వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి వరదలు, ఆకస్మిక వరదలు, పట్టణ ప్రాంతాల్లో నీటి ముంపు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున స్థానికంగా శిక్షణ పొందిన యువత అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్నారు. 6వ బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ మాట్లాడుతూ విపత్తులు సంభవించిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు వేగంగా స్పందించి ప్రాథమిక సహాయక చర్యలు చేపట్టగలరన్నారు. శిక్షణలో బోట్ నిర్వహణ, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, పైకి ఎక్కడం, కిందికి దిగడం, రాక్ క్లైంబింగ్, వివిధ రకాల ముడుల వినియోగం వంటి ప్రాక్టికల్ అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణలో ఏదైనా అంశం స్పష్టంగా అర్థం కాకపోతే శిక్షకులను అడిగి తెలుసుకుని, పదేపదే సాధన చేయడం ద్వారా పూర్తి నైపుణ్యం, ఆత్మవిశ్వాసం సాధించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఆపదమిత్రలకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా శిక్షణ కిట్లను అందజేశారు. విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకు వచ్చిన ఆపదమిత్రలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఆపదమిత్రకు మూడు సంవత్సరాల కాలానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 416 మంది ఆపదమిత్రులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా తొలి విడతగా 120 మందికి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, శిక్షకులు, ఆపదమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు అండగా నిలిచిన దాతలు

**- యూనిఫాంలు, క్రీడా దుస్తులతో పాటు టేబుళ్లు, కుర్చీల వితరణ**

**- పోలంపల్లి గేట్ తండా యూపీఎస్ పాఠశాలలో ఘనంగా పంపిణీ కార్యక్రమం**

**సింగరేణి, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** విద్యార్థుల చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పోలంపల్లి గేట్ తండా యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, క్రీడా దుస్తులు, పాఠశాలకు అవసరమైన టేబుళ్లు, కుర్చీలను వితరణ చేశారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పోలంపల్లి మాజీ సర్పంచ్ భద్రు నాయక్, జరపల రాజ్‌కుమార్, చంద్రు ఫౌండేషన్ అధ్యక్షుడు వీరన్న నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా దుస్తులు, యూనిఫాంలు, పాఠశాలకు టేబుళ్లు, కుర్చీలు అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వం ద్వారా పాఠశాలకు అందిన యూనిఫాంలు, షూస్‌ను సింగరేణి మండల విద్యాశాఖ అధికారి, పోలంపల్లి సర్పంచ్ దారావత్ హేమలత బాలాజీ, ఉప సర్పంచ్ గుగులోతు శ్రవణ్ కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు పుట్టినరోజు వేడుకల సందర్భంగా సేవా కార్యక్రమం మాజీ సర్పంచ్ భద్రు నాయక్ కుమారుడు వినాయక్, జాశ్రీత పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. పుట్టినరోజు వేడుకలను విద్యార్థులతో కలిసి జరుపుకోవడంతో పాటు వారికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, వీరన్న, దస్రు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు రమేష్, లావణ్య, సుజాత, మాజీ సర్పంచ్ సక్కు, గ్రామ పెద్దలు గుగులోతు జగ్గయ్య, తేజ నాయక్, చందర్, రాందాస్, లక్ష్మణ్, వినాయక్, పండు, హరి, రమేష్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు అందించేందుకు గ్రామస్థులు, దాతలు ముందుకు రావడం పాఠశాల అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.





# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ముందుకు

**- చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు: పోలంపల్లి సర్పంచ్ దారావత్ హేమలత**

**సింగరేణి, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని, చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పోలంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ దారావత్ హేమలత అన్నారు. సింగరేణి మండలం పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మోకాళ్లగుంపు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దారావత్ హేమలత చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాంలు, షూస్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ హేమలత మాట్లాడుతూ పాఠశాల దశ విద్యార్థుల జీవితంలో ఎంతో కీలకమైందన్నారు. "ఈరోజు మీరు వేసుకునే పాఠశాల యూనిఫాం కేవలం దుస్తులు మాత్రమే కాదు.. రేపటి మీ లక్ష్యాలకు గుర్తుగా భావించాలి. కష్టపడి చదివి మీ తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి" అని విద్యార్థులకు సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడికను అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను శ్రద్ధగా విని తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించేందుకు గ్రామపంచాయతీ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మీరా వీరునాయక్, పోలంపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ దారావత్ భద్రు నాయక్, సహ ఉపాధ్యాయులు బానోత్ మంగీలాల్, ఆయా ఈసాల కౌసల్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు భరోసాగా పోలీసులు

**- గణేష్ నవరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్సై బి. గోపి**

**కారేపల్లి, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్ రాములు):** ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత అని, ఏ సమస్య ఎదురైనా ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని కారేపల్లి ఎస్సై బి. గోపి తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటిపై చట్టపరంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ పోలీసుల సహకారం, భరోసా ఉంటుందని పేర్కొన్నారు. మండలంలో గణేష్ నవరాత్రి వేడుకలు కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై సూచించారు. గణేష్ మండపాల వద్ద భక్తిశ్రద్ధలకు ప్రాధాన్యం ఇస్తూ భక్తి గీతాలకే పరిమితం కావాలని, అన్నదాన కార్యక్రమాలను క్రమబద్ధంగా నిర్వహించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు.

**మహిళలు.. చిన్నారులు.. వృద్ధుల భద్రతకు ప్రాధాన్యం**

సాయంత్రం వేళల్లో మండపాల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో తోపులాటలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాలను నిర్వహించాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీలపై ఉందన్నారు.

**ఊరేగింపుల్లో నిబంధనలు పాటించాలి**

గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో మద్యం సేవించి గొడవలకు పాల్పడటం, ఇతరులకు ఇబ్బందులు కలిగించడం, మహిళలను కించపరిచేలా ప్రవర్తించడం వంటి చర్యలను సహించబోమని ఎస్సై బి. గోపి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గణేష్ నవరాత్రి వేడుకలు భక్తి, శాంతి, సోదరభావంతో కొనసాగేందుకు ఉత్సవ కమిటీలు, యువజన సంఘాలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు. పండుగ వాతావరణంలో ప్రతి ఒక్కరి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పోలీసు శాఖ అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.



# అంబేద్కర్‌పై అభ్యంతరకర ప్రచారం హమారా ప్రసాద్‌పై చర్యలకు డిమాండ్



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అభ్యంతరకరంగా ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో బుధవారం బహుజన నాయకుల ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా అంబేద్కర్‌పై 'కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకం రాస్తున్నట్లు, ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు హమారా ప్రసాద్ ప్రచారం చేసుకుంటున్నారని నాయకులు తెలిపారు. అంబేద్కర్‌ను అవమానించేలా ఉన్న ప్రచారాన్ని అడ్డుకోవాలని, ఈ వ్యవహారంపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దళిత సంఘం సీనియర్ నాయకులు జేబీ బాలశౌరి మాట్లాడుతూ... అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్న హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హమారా ప్రసాద్, హైందవ ప్రసాద్ వెనుక ఉన్నారని ఆరోపిస్తున్న సూత్రధారులను గుర్తించి విచారణ జరపాలని కోరారు. ప్రముఖ న్యాయవాది మారపాక రమేష్ మాట్లాడుతూ... సమాజంలో విఘాతం కలిగించేలా ఉన్న చర్యలను ప్రభుత్వం, అధికారులు గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మల్లెల రామనాథం మాట్లాడుతూ... డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బహుజనులు, పీడితులు, దళితుల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ఆయన చరిత్రను పూర్తిగా తెలుసుకోకుండా కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు, ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. బీసీ సంఘం జిల్లా నాయకులు కురిమెళ్ల శంకర్ మాట్లాడుతూ... హమారా ప్రసాద్‌ను పావుగా ఉపయోగించి సమాజంలో మత కల్లోలం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అంబేద్కర్ వాదాన్ని, రాజ్యాంగ విలువలను దెబ్బతీసే ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించాలని అన్నారు. మాదిగ జేఏసీ నాయకులు మోదుగు జోగారావు మాట్లాడుతూ... ఈ పరిణామాలపై అన్ని వర్గాల ప్రజలు స్పందించాలని కోరారు. వ్యవహారం కొనసాగుతున్నప్పటికీ రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. సమాజంలో అశాంతికి దారితీసే ప్రయత్నాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. పత్రికా సమావేశం అనంతరం హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బహుజన నాయకులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక జిల్లా నాయకులు వేల్పుల భాస్కర్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు, మాదిగ యువజన జిల్లా నాయకులు గడ్డం రాజశేఖర్, బీసీ సంఘం రాష్ట్ర యువజన నాయకులు మెట్టెల సైదుబాబు, అంబేద్కర్ యువజన జిల్లా నాయకులు నరాల రాజేష్, మాదిగ సంఘం నాయకులు గుండేటి వెంకట రాములు, మురిపిటి రాములు, మురిపిటి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ఎగ్జామ్‌లో ర్యాంక్ సాధించిన వైరా వాసి సందీప్

- వైరా వాసి సందీప్‌కు ఘన సన్మానం చేసిన కాంగ్రెస్ నాయకులు



**వైరా, సెప్టెంబర్ 16, (భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ 16వ వార్డుకు చెందిన బక్క రాములు - సావిత్రి దంపతుల కుమారుడు బక్క సందీప్ నీట్ లో ర్యాంకు సాధించి హైదరాబాదులోని మెడికల్ కాలేజీలో మెడికల్ సీడ్స్ సాధించిన సందర్భంగా వైరాలో కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. రామ్ పూడి రోశయ్య నివాసములు నిర్వహించిన కార్యక్రమంలో బక్క సందీప్ ను ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సందీప్ కష్టపడి చదివి మెడికల్ సీడ్స్ సాధించటం అభినందనీయమని, సందీప్ భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాంపూడి రోశయ్య, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, 16 వార్డ్ కౌన్సిలర్ రాచమంటి బలరామయ్య, 17 వార్డ్ కౌన్సిలర్ భక్తుల సుమతి, రాంపూర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొని సందీప్ కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు

# రేగళ్ల తండా ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ


**- పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై అసంతృప్తి**
**- మెనూ అమలులో నిర్లక్ష్యంపై వార్డెన్‌కు షోకాజ్ నోటీసు**
**- వసతి గృహంలో సౌకర్యాలు, ఆహార పదార్థాల నాణ్యతపై పరిశీలన**
**- పనిచేయని ఆర్వో ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలి**





**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్):-** లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, అక్కడ అపరిశుభ్రతతో పాటు చెత్త ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎన్‌సీసీలో ఉన్న విద్యార్థుల సంఖ్య, గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను ఉపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, భోజనం తదితర సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి నిల్వ ఉంచిన సరుకులు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కిచెన్‌లోని ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం, తాగునీరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మెనూలో చికెన్ అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులకు వడ్డించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేస్తూ, సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు . ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ మహాంకాళి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్):** కొత్తగూడెం బూడిదగడ్డ, కోతగూడెం ప్రాంతంలోని శ్రీశ్రీశ్రీ మహాంకాళి అమ్మవారి దేవాలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవ ఆహ్వానం పేరుతో నిర్వహించనున్న ఈ వేడుకలు అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 20, 2026 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించనున్నారు. ఆలయ చరిత్రను పరిశీలిస్తే, ఈ క్షేత్రం 1963లో పాకీ కులస్తులచే నిర్మించబడగా, అనంతరం 1995లో శ్రీ నరేంద్రభవాని స్వామి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తూ ప్రతిఏటా శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలుఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 11న ఆదివారం కలశస్థాపన, బాలా పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 16న అమ్మవారికి ప్రత్యేక పూజలు, 17న శ్రీమూల నక్షత్ర పూజ, 18న దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు, 19న నవమి పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 20న విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ముగించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు తీర్థప్రసాదాలు అందించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# విపత్తుల వేళ తక్షణ స్పందనకు యువ ఆపదమిత్రలు సిద్ధంగా ఉండాలి

**- కలెక్టర్ అంకిత్**
**- విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపదమిత్రల పాత్ర కీలకం**
**- యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్**
**- సమయస్ఫూర్తి, మానసిక అప్రమత్తతతో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి**







**లక్ష్మీదేవి పల్లి ,సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్):-** విపత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపదమిత్రలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవి పల్లి మండలం చాతకొండ ఆరవ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా 6వ బెటాలియన్‌కు చేరుకున్న కలెక్టర్‌కు బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భౌగోళిక, వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి వరదలు, ఆకస్మిక వరదలు, పట్టణ ప్రాంతాల్లో నీటి ముంపు, అటవీ అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున స్థానికంగా శిక్షణ పొందిన యువత అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్నారు. విపత్తుల సమయంలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక అప్రమత్తత, సమయస్ఫూర్తి, పరిస్థితిని వేగంగా అంచనా వేసే సామర్థ్యం, సరైన నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఎంతో కీలకమని కలెక్టర్ తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రామాణిక నిర్వహణ విధానాలు, సమాచార ప్రసారం, రెస్క్యూ పరికరాల వినియోగం, బృంద సమన్వయం వంటి అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. విపత్తు నిర్వహణ అనేది కేవలం తరగతి గదిలో నేర్చుకునే అంశం కాదని, క్షేత్రస్థాయిలో నిరంతర సాధన, మాక్ డ్రిల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సి ఉంటుందని అన్నారు. శిక్షణను పూర్తి ఏకాగ్రతతో తీసుకుని, నేర్చుకున్న అంశాలను పదేపదే సాధన చేసి జిల్లాకు ఉపయోగపడేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అవసరమైన రెస్క్యూ పరికరాలు, కిట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 6వ బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ మాట్లాడుతూ విపత్తులు సంభవించిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు వేగంగా స్పందించి ప్రాథమిక సహాయక చర్యలు చేపట్టగలరన్నారు. శిక్షణలో బోట్ నిర్వహణ, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, పైకి ఎక్కడం, కిందికి దిగడం, రాక్ క్లైంబింగ్, వివిధ రకాల ముడుల వినియోగం వంటి ప్రాక్టికల్ అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణలో ఏదైనా అంశం స్పష్టంగా అర్థం కాకపోతే శిక్షకులను అడిగి తెలుసుకుని, పదేపదే సాధన చేయడం ద్వారా పూర్తి నైపుణ్యం, ఆత్మవిశ్వాసం సాధించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఆపదమిత్రలకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా శిక్షణ కిట్లను అందజేశారు. విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకు వచ్చిన ఆపదమిత్రలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఆపదమిత్రకు మూడు సంవత్సరాల కాలానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 416 మంది ఆపదమిత్రులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా తొలి విడతగా 120 మందికి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాల మేరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆపదమిత్రలకు శిక్షణ అందిస్తున్నారు. నెహ్రూ యువ కేంద్రాలు, ఎన్‌ఎస్‌ఎస్, మై భారత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ తదితర సంస్థల ద్వారా ఎంపికైన యువతకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలో తొలి విడతగా 120 మంది ఆపదమిత్రలకు శిక్షణ నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణలో విపత్తుల రకాలు, ప్రకృతి మరియు మానవ తప్పిదాల వల్ల సంభవించే విపత్తులు, విపత్తుల ముందు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, విపత్తుల సమయంలో స్పందన, విపత్తుల అనంతరం సహాయక చర్యలు, ప్రథమ చికిత్స, రెస్క్యూ పరికరాల వినియోగం, బోట్‌ను అమర్చడం, విడదీయడం, ప్రారంభించడం, నిర్వహించడం, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, రాక్ క్లైంబింగ్, వివిధ రకాల ముడులు తదితర అంశాలపై సైద్ధాంతిక, ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, పోలీసు, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు, శిక్షకులు, ఆపదమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నాలు తొలిగించి విజయాలు కలిగించు.. లంబోధర.!

- భక్తుల పూజలందుకుంటున్న గణనాథుడు



**మణుగూరు సెప్టెంబర్ 16( భద్రాద్రి న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల బాలల సదనం సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన గణాధిపతుడికి పంచమ నవరాత్రి మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మండపంలో కొలువైన గణనాథుడు అర్చకుల చేత నిత్య పూజలందు కుంటున్నాడు. మంగళవారం అర్చకులు చేత విఘ్నాధిపతికి అధిపతుడైన గణపతిని విఘ్నాలు తొలగించాలని, నిత్య పూజలో భాగంగా దేవరకొండ నరసింహాచారి, లలిత దంపతులు, కనుకు రమేష్, సంధ్యా దంపతులు పీటలమీద కూర్చొని, వివిధ రకాల పుష్పాలు, పంచామృతాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పీటలపై కూర్చున్న దంపతులు లంబోధరుడుకు ఇష్టమైన ఉండ్రాళ్ళు, పాయసం, పులిహోర, సెనగలు వంటి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం తిలకించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ వారు మాట్లాడుతూ.. వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుని వేడుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక చవితిని మూడు రోజులు వైభవంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఆహ్లాదకరంగా భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గణనాధుని కృప ఎల్లవేళలా కమిటీ సభ్యులపై, ప్రజలందరిపై ఉండాలని తమకు సేవ చేసుకునే భాగ్యం ప్రతి సంవత్సరం కలగాలని ఏకదంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. బుధవారం మండపంలో మహా అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదంను స్వీకరించారు. నేడు జరిగే లడ్డు వేలంపాట అనంతరం గణేష్ నిమజ్జనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఊరేగింపును విజయవంతం చేయాలని శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.



# టీజేఏ ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండి రషీద్

**- ప్రధాన కార్యదర్శిగా ఎం. చిన్ని ఏకగ్రీవ ఎన్నిక**

**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్ ):**-తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.టీజేఏ రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి. నాగస్వామి ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా ఎండి రషీద్, ప్రధాన కార్యదర్శిగా ఎం. చిన్ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సందర్భంగా నూతన ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రషీద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి , తనకి పదవీ బాధ్యతలు అందజేసిన సంఘం జిల్లా అధ్యక్షుడు నాగస్వామి లకు కృతజ్ఞతలు ప్రకటించారు. సంఘం బలోపేతం తో పాటు జర్నలిస్టుల సమస్యల సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీనిచ్చారు. టీజేఏ జిల్లా అధ్యక్షుడు నాగస్వామి ప్రత్యేకంగా తనను ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నియమించడంలో తనపై గల విశ్వాసాన్ని ఏ పరిస్థితుల్లో తాను వమ్ము చేయనని రషీద్ ప్రకటించారు. జర్నలిస్టులు ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో తమ వృత్తి బాధ్యతలను నిర్వహిస్తున్నారని వారి సేవలను ఖమ్మం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ఉపయోగించుకునే విషయంలో వారి సహకారాన్ని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో అనుభవాన్ని జీవిత సారాన్ని గ్రహించిన సీనియర్ జర్నలిస్టుల సలహాలు, సూచనలు సహకారంను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సమిష్టి నిర్ణయాలతో ఖమ్మం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి , ఖమ్మం జర్నలిస్టుల అభ్యున్నతికి పాటుపడతానని చెప్పారు. అదేవిధంగా తోటి టీజేఏ సభ్యులు, ఇతర జర్నలిస్టులు కూడా ఖమ్మం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తనతోపాటు పాటుపడే విషయంలో తోడుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ఖమ్మం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఎం. చిన్ని బాధ్యతలు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం,యూనియన్ బలోపేతమే లక్ష్యంగా ముందుకెళ్తానని స్పష్టం చేశారు. ?జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ అసోసియేషన్ పురోగతికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు, ఖమ్మం ప్రెస్ క్లబ్ సభ్యులు మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎండి రషీద్‌ను టీజేఏ జిల్లా నాయకులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో




జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కే. మణికుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్కే ఖాసిం, జిల్లా ప్రధాన కార్యదర్శి మత్తి రామకృష్ణ, కోశాధికారి బొడపట్ల సతీష్, జిల్లా నాయకులు వాసం రాజేంద్రప్రసాద్, నల్లమోతు శ్రీనివాసరావు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఎండి రషీద్, ప్రధాన కార్యదర్శి ఎం. చిన్ని మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# చిత్రలేఖనంలో 'చిచ్చరపిడుగు'.. గల్ఫన్‌కు గురుకులం అభినందన

**- రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో వరుస బహుమతులు..**

**- ప్రతిభకు ప్రిన్సిపల్ డాక్టర్ టి. రాములు ప్రశంసలు**

**మధిర సెప్టెంబర్ 16:** చిత్రలేఖనంలో తన ప్రతిభతో రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో వరుసగా బహుమతులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, ముదిగొండ విద్యార్థి తడికమల్ల గల్ఫన్‌ను కిష్టాపురం గురుకుల ప్రిన్సిపల్ డాక్టర్ టి. రాములు అభినందించారు. బుధవారం కిష్టాపురంలోని గురుకుల ఆవరణలో గల్ఫన్‌కు ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇటీవల మధిరలో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రూ.3 వేల నగదు బహుమతిని గల్ఫన్ సాధించాడు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న గల్ఫన్ గతంలోనూ పలు రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు. చిన్న వయసులోనే చిత్రకళలో అసాధారణ ప్రతిభ చూపుతూ తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్న గల్ఫన్‌ను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ టి. రాములు మాట్లాడుతూ ఆర్ట్ టీచర్ హ్యారీ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు చిత్రలేఖనంలో అనేక మెలకువలు నేర్చుకుంటూ పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, లలిత కళలు, ఇతర కో-కరిక్యులర్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడంతో పాటు ఒత్తిడిని తట్టుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే సామర్థ్యం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐనాల సైదులు, జేవీపీ సంజీవరావు, సీనియర్ అధ్యాపకులు కొక్కిరేణి సత్యం, రజనీకాంత్,




రామయ్య, ఉపాధ్యాయులు బొక్క నాగేశ్వరరావు, లాల్ సైదులు, అంజయ్య, కె. నాగేశ్వరరావు, మహేష్, శరత్, హౌస్ మాస్టర్ శాంసన్, తెల్లూరి కృష్ణమూర్తి, సుధాకర్, రామకృష్ణ, రేణుక, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగల రూపంలో మృత్యువు..

## ఇద్దరి ప్రాణాలు బలి!

**- పేరూరులో విద్యుత్ ప్రమాద మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**- వర్షాకాలంలో ప్రమాదకర విద్యుత్ లైన్లపై నిఘా ఏది?.. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్**



**వాజేడు, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** వర్షం వేళ పొలాల్లోకి వెళ్లిన ఇద్దరి ప్రాణాలను ప్రమాదకర విద్యుత్ తీగలు బలిగొన్న ఘటన వాజేడు మండలం పేరూరు గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మిరప పంట వద్దకు వెళ్లిన సమయంలో త్రీఫేస్ విద్యుత్ తీగలు కంచెపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పొలాల్లో పనులు చేసుకునే రైతులు, కూలీల భద్రతపై ప్రశ్నలు తలెత్తేలా ఈ ఘటన మారింది. విద్యుత్ లైన్లు, కంచెలు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోతే ఇలాంటి విషాదాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే**

విద్యుత్ ప్రమాదం జరిగిన సమయంలో భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అసెంబ్లీ సమావేశాల్లో ఉండటంతో బాధిత కుటుంబాలను అప్పట్లో పరామర్శించలేకపోయారు. అసెంబ్లీ సమావేశాలు ముగించుకుని నియోజకవర్గానికి చేరుకున్న అనంతరం ఎమ్మెల్యే బుధవారం పేరూరు గ్రామానికి వెళ్లి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే.. ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాల బాధను మాటల్లో చెప్పలేమని పేర్కొన్నారు.

**అండగా ఉంటామని భరోసా**

ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని సూచించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం, పరిహారం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**ప్రమాదకర విద్యుత్ లైన్లపై చర్యలు ఎప్పుడు?**

వర్షాకాలంలో విద్యుత్ తీగలు తెగిపడటం, కంచెలపై విద్యుత్ ప్రసారం కావడం వంటి ఘటనలు ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పుగా మారుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ప్రమాదం జరగకముందే విద్యుత్ లైన్లను తనిఖీ చేసి లోపాలను గుర్తించి సరిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు అంటున్నారు. పొలాలు, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలు, తీగలు, కంచెలు, దెబ్బతిన్న లైన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదకర పరిస్థితులను వెంటనే తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరో కుటుంబం ఇలాంటి విషాదాన్ని ఎదుర్కోకుండా విద్యుత్ శాఖ అధికారులు





ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం.. సెప్టెంబర్ 21న 'చలో ఐటీడీఏ'

**- భద్రాచలం ఐటీడీఏ ముట్టడికి భారీగా తరలిరావాలి**

**- ఉద్యోగాలు, వాటా, ఏజెన్సీ హక్కులపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం: తుడుందెబ్బ**

**చర్ల, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్):** ఆదివాసీల హక్కులు, ఉద్యోగాలు, ఏజెన్సీ ప్రాంతాల పరిరక్షణ కోసం ఈ నెల 21న భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద నిర్వహించనున్న చలో ఐటీడీఏ ఆదివాసీ మార్చ్ ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, కరపత్రాలను బుధవారం చర్లలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో విడుదల చేశారు. చర్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి పూజారి సామ్రాజ్యం కోమరం భీమ్ విగ్రహం ఎదుట పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు వాసం ముసలయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆదివాసీల సమస్యలు పరిష్కారం కాకపోగా, వారి హక్కులు, అవకాశాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు.

**ఐటీడీఏలను నిర్వీర్యం చేస్తున్నారంటూ ఆగ్రహం**

ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి కీలకమైన ఐటీడీఏలను నిర్వీర్యం చేసే చర్యలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలను మైదాన ప్రాంతాలకు తరలించడం ద్వారా స్థానిక ఆదివాసీ యువతకు అన్యాయం జరుగుతోందని అన్నారు. ఇటీవల వెలువడిన పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లోనూ ఆదివాసీ నిరుద్యోగ యువతకు న్యాయం జరగడం లేదని ఆరోపించారు. జీవో 109 ప్రకారం ఆదివాసీలకు దక్కాల్సిన వాటాను వారికి కల్పించాలని డిమాండ్ చేశారు.

**ఏజెన్సీలో వడ్డీ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలి**

1960 వడ్డీ వ్యాపార నిషేధ చట్టం అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు వడ్డీ వ్యాపారం చేస్తూ ఆదివాసీలను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని వాసం ముసలయ్య ఆరోపించారు. ఈ వ్యవహారాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఆదివాసీల భూములు, హక్కులు, ఉద్యోగాలు, జీవనాధారం పరిరక్షణకు ప్రభుత్వం స్పష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



**చలో ఐటీడీఏ'కు భారీగా తరలిరావాలి**

సెప్టెంబర్ 21న భద్రాచలంలో నిర్వహించనున్న లి'చలో ఐటీడీఏ ఆదివాసీ మార్చ్'లికు ఆదివాసీ ప్రజలు, యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వాసం ముసలయ్య పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వాల్లే శ్రీకాంత్, సీనియర్ నాయకుడు పూనెం వరప్రసాద్, మండల అధ్యక్షుడు తాటి రామకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం రవికిరణ్, కోశాధికారి కలం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సోడి రవీంద్ర, సహాయ కార్యదర్శి తుర్రం ఆదినారాయణ, ఆర్గనైజేషన్ సెక్రటరీ తాటి శ్రీను, మడప అనిల్ కుమార్, సోడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో ఓజోన్ పరిరక్షణపై అవగాహన

**- వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ**



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్):** వరల్డ్ ఓజోన్ డేను పురస్కరించుకుని ఓజోన్ పొర పరిరక్షణ, పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని త్రివేణి పాఠశాల, ఖమ్మం శాఖలో ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పొర ప్రాధాన్యత, దాని క్షీణత వల్ల కలిగే ప్రభావాలు, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఓజోన్ పొర భూమిపై జీవరాశులకు రక్షణ కవచంగా పనిచేస్తుందని, దాని పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అవసరమని అన్నారు. పర్యావరణ హితమైన అలవాట్లను పాటిస్తూ, ప్రకృతి సంరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఓజోన్ పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను సృజనాత్మకంగా వ్యక్తీకరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన టాప్-5 విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిప్పాపురంలో డెంగ్యూ భయం.. అధికారులు మేల్కొనాలి!

**- దోమల బెడదతో ప్రజల ఆందోళన.. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి**

**- నీటి నిల్వలు, మురుగు కాలువలు శుభ్రం చేసి దోమల నివారణ మందులు పిచికారీ చేయాలి: మాజీ సర్పంచ్ కారం కన్నారావు**

**చర్ల, సెప్టెంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :** తిప్పాపురం గ్రామంలో దోమల బెడద పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని తిప్పాపురం మాజీ సర్పంచ్ కారం కన్నారావు కోరారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉన్న సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ఆలస్యం చేయవద్దని ఆయన సూచించారు.గ్రామంలోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే ప్రదేశాలు, మురుగు కాలువలు, చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణమే శుభ్రం చేయాలని కోరారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాల్లో అవసరమైన మందులను పిచికారీ చేసి, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని అన్నారు.వ్యాధులు ప్రబలిన తర్వాత హడావుడి చేయడం కంటే.. ముందుగానే నివారణ చర్యలు చేపట్టడమే ప్రజారోగ్య పరిరక్షణకు కీలకమని కారం కన్నారావు పేర్కొన్నారు. గ్రామంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించాలని, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అలాగే డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జ్వరం తదితర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని ఆశ్రయించేలా సూచనలు ఇవ్వాలని కోరారు. అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. తిప్పాపురం ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం వీడి వెంటనే స్పందించాలని కారం కన్నారావు కోరారు. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి, దోమల నివారణకు పిచికారీ చేపట్టడంతో పాటు పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.



# పొంగులేటి పై బిఆర్ఎస్ అనుచిత వ్యాఖ్యలు తగదు

**- మాజీ జడ్పీటీసీ మేకల మల్లిబాబు యాదవ్ ఆగ్రహం**

**- అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకే విమర్శలని ధ్వజం**



**కామేపల్లి,సెప్టెంబర్ 16(భద్రాద్రి న్యూస్):** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను మాజీ జడ్పీటీసీ,డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా,రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సంచలనాత్మక నిర్ణయాలతో ముందుకు సాగుతుంటే ఓర్వలేకనే విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. బుధవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థలో మంత్రి పొంగులేటి విప్లవాత్మక ప్రక్షాళన చేస్తూ ప్రజలకు పాలనను చేరువ చేస్తున్నారని పేర్కొన్నారు.తమ ఉనికి ఎక్కడ కోల్పోతామోనన్న భయంతోనే బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు.

**అవినీతిమయంగా కాళేశ్వరం:**

తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. రూ.1.25 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును అవినీతిమయం చేసి,బీఆర్ఎస్ నేతలకు ఏటీఎంగా మార్చుకున్నారని ఆరోపించారు.58, 59 జీవోల పేరుతో ఖాళీ భూములను కబ్జా చేశారని మండిపడ్డారు.

**ధరణి స్థానంలో భూభారతి:**

గతంలో ధరణి పోర్టల్ పేరుతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, కఠినమైన నిబంధనలతో సామాన్యులకు భూ రిజిస్ట్రేషన్లు కాకుండా నరకం చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ లోప భూయిష్టమైన ధరణి స్థానంలో సామాన్యులకు సైతం సులభంగా, పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం 'భూభారతి'ని తీసుకువచ్చిందని తెలిపారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడే ధైర్యం లేని ప్రతిపక్ష నేత ఉండటం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు.

**బుద్ధి చెబుతాం జాగ్రత్త!**

ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వనని ఛాలెంజ్ చేసి, కాంగ్రెస్ జెండా ఎగరేసిన నాయకుడు పొంగులేటి అని గుర్తుచేశారు. ఆయనపై చేసిన విమర్శలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండిపాడు గ్రామ పంచాయతీ బాధ్యులు గుగులోతు రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్, బాదావత్ నాగరాజు,వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు దేరంగుల తిరపయ్య,బండి ఉపేందర్,తురక బిక్షం,మొగిలి శ్రీను, చల్ల మల్లయ్య, పగిడిపల్లి రాములు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కామేపల్లి తహసిల్దార్ కార్యాలయంలో
# సిబ్బంది కొరత ఏజెన్సీ గ్రామ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

- జిల్లా లో ఉన్న ముగ్గురు మంత్రులు ఈ మండలాన్ని పట్టించుకోరు
- స్థానిక ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులకు కి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న హామీలకే పరిమితం
- ఎన్నిసార్లు పత్రికలో కథనాలు వచ్చిన చూసి చూడని జిల్లా అధికారులు
- ఖాళీగా ఉన్న మండల తాసిల్దార్ కార్యాలయం సిబ్బందల పోస్టులను భర్తీ చేయని జిల్లా కలెక్టర్
- రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కామేపల్లి మండలం సమస్యల పై వెంటనే స్పందించి చొరవ చూపాలి





**కామేపల్లి, సెప్టెంబరు16 (భద్రాద్రి న్యూస్):-** కామేపల్లి మండల రెవెన్యూ తాసిల్దార్ కార్యాలయంలో తీవ్రమైన సిబ్బంది కొరత వేధిస్తుండటంతో రోజువారీ పనుల కోసం వచ్చి పోయే ఏజెన్సీ ప్రజలు, గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కార్యాలయంలో టైపిస్టు,జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) వంటి కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో రోజువారీ పరిపాలన పడకేసింది.

?సిబ్బంది కొరత కారణంగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర ప్రభుత్వ సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు గిరిజనులకు సకాలంలో అందడం లేదని మండిపడుతున్నారు.

**తహసిల్దార్ వివరణ :**

ఈ విషయమై బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలే శ్రీను యాదవ్ కామేపల్లి ఎమ్మార్వోను వివరణ కోరగా.. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. అయితే,ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే పనులను వేగవంతంగా సకాలంలో పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నామని ఆయన ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరిస్తున్నామని వారు వెల్లడించారు.

**జిల్లా కలెక్టర్ స్పందించాలి:-**

మండల రెవెన్యూ కార్యాలయంలో వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని, లేదా డిప్యూటేషన్‌పై అవసరమైన సిబ్బందిని నియమించి ఏజెన్సీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని బాధితులు, నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఖమ్మం జిల్లా వాసి అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఇంకటైనా ఇప్పటికైనా ఈ కామేపల్లి మండల రెవిన్యూ తాసిల్దార్ కార్యాలయంలో ఉన్న ఖాళీ పోస్టులను పూర్తిచేయాలని ఈ మండలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులను ప్రజలను నాయకుల పై దృష్టి పెట్టుకొని రెవిన్యూ కార్యాలయం సిబ్బంది కాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి సమస్య పరిష్కార మార్గం చూపి న్యాయం జరిగేటట్టు స్పందించవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు కోరుకుంటున్నారు



## జడ్చర్లలో చిన్న వినాయకుల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు

### మూడు ప్రాంతాల్లో తాత్కాలిక పాండ్స్ ఏర్పాటు.. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభం

**జడ్చర్ల, సెప్టెంబర్ 16:**

మున్సిపాలిటీ పరిధిలో చిన్న వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి చిన్న వినాయకుల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో, హౌసింగ్ బోర్డు ప్రాంతంలో, బీసీ హాస్టల్ వెనుక కల్వకుర్తి రోడ్ పార్కులో తాత్కాలిక నిమజ్జన పాండ్స్‌ను ఏర్పాటు చేశారు.వినాయక చవితి సందర్భంగా భక్తులు ప్రతిష్ఠించిన చిన్న వినాయక విగ్రహాలను సులభంగా, సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు ఈ తాత్కాలిక పాండ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. నిమజ్జనం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మున్సిపాలిటీ పరిధిలోనే ప్రత్యేక సౌకర్యం కల్పించడంతో భక్తులకు ఇబ్బందులు తగ్గనున్నాయి.ఈ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీ గిరీష్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీఓ లక్ష్మీపతి, మేనేజర్ లక్ష్మన్న, ఏఈ గాయత్రి, ఆర్ఓ సలాం, ఆర్ఐ నాగేష్ తదితర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భక్తులు మున్సిపల్ అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని, తాత్కాలిక పాండ్స్‌ను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించనున్నారు.

## కామేపల్లి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ





**కామేపల్లి,సెప్టెంబర్ 16(భద్రాద్రి న్యూస్ ):** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రెండు జతల యూనిఫామ్‌లు, షూ,రెండు జతల సాక్స్‌లను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ బి. విద్యాసాగర్, ఏపీఎం రామారావు, సీసీ చైతన్యలు ముఖ్య అతిథులుగా హాజరై ఈ దుస్తులు, షూలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు.ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఎం. సతీష్,పి.వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్, ఎస్పిలకు రేపల్లె ఘటనపై మెమొరండం అందజేసిన సంఘాల జేఏసీ నాయకులు

**గద్వాల , సెప్టెంబర్ 15 :**

గద్వాల జిల్లా కలెక్టర్, ఎస్ పి కి రేపల్లె గ్రామ సంఘటన పై మెమోరాండం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు, బహుజన, ప్రజా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ...రేపల్లె గ్రామంలో ప్రేమ పెళ్లి విషయంలో దళిత అబ్బాయి ఇంటిని,బీసీ సామాజిక వర్గం అమ్మాయి తరపు వాళ్లు కుల వివక్ష తో కూల్చడం జరిగింది. దీనిని ఖండిస్తూ అఖిల పక్ష,బహుజన, ప్రజా సంఘాల తరపున కలెక్టర్ కి మెమోరాండం సమర్పించడం జరిగింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కమిటీ నాయకులు కలెక్టర్ రిజ్వాన్ షేక్ కి వివరించడం జరిగింది. అదేవిధంగా గ్రామాన్ని సందర్శించి ఇంకా వివరాలన్నీ సేకరించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరడం జరిగింది. ఈమధ్య కాలంలో చాలా గ్రామాలలో కులాంతర ప్రేమ వివాహాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. కాబట్టి ప్రజలకు చట్టం పట్ల,నిబంధనల పట్ల సామాజిక చైతన్యం కలిగే టట్లు అధికారుల చేత, సామాజిక కార్యకర్తల, మరియు లాయర్ల చేత ప్రతి వారం గ్రామాలలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరడం జరిగింది.దళిత కుటుంబం ఇంటిని పునర్ నిర్మించాలని, వారికి తగిన నష్టపరిహారం ఎస్ సి, ఎస్ టి సబ్ ప్లాన్ ప్రకారం చెల్లించాలని కోరారు . ఇంటిని కూల్చివేయడానికి ప్రయత్నించిన నిందితులను అరెస్టు చేయడం తో పాటు,సర్పంచ్ ను కూడా విచారణ చేయాలని కోరుతున్నాము. జోగులాంబ గద్వాల జిల్లాలో చాలా గ్రామాలలో రాజకీయ నాయకుల వల్ల గొడవలకు ఆస్కారం లేకుండచూడాలి.ఇలాంటివి జరిగినప్పుడు చట్టపరమైన చర్యలతో పాటు,ప్రజల్ని నిత్యం సామాజికంగా చైతన్యం చేయాలి. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష, బహుజన, ప్రజా సంఘాల నాయకులు బి ఆర్ ఎస్ నాగరుదొడ్డి వెంకట రాములు, సి పి ఎం వెంకటస్వామి,సిపిఐ ఆంజనేయులు, ఉప్పేరు సుభాన్ ,బహుజన రాజ్య సమితి వాల్మీకి, వినోద్ కుమార్,కోళ్ల హుస్సేన్, కుర్వ పల్లయ్య, సుభాన్,అవాజ్ కమిటీ అతికూర్ రెహ్మాన్,శంకర ప్రభాకర్, మధుసూదన్ బాబు,దానయ్య, టీపీఫ్ నాగన్న,రైమతుల్లా, మీడిదొడ్డీ నర్సింహులు,ఉత్తనూర్ వెంకన్న,దామోదర్,కృష్ణ,ఉరుకుందు, వీరన్న, కృష్ణయ్య, సాధత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతికతతో బజ్జీల పచ్చిమిర్చి సాగు

- మేలైన యాజమాన్యంతో గిరిజన దంపతుల కొత్త రికార్డు
- డ్రిప్, పాలీమల్చింగ్‌తో 280 రోజుల పాటు నిరంతర దిగుబడి
- తోటి రైతులకు ఆదర్శంగా బర్లగూడెం మాలోత్ విజయ-బాలు
- విపరీతంగా కూరగాయల మార్కెట్ కు తరలిస్తున్న పచ్చిమిర్చి





**కామేపల్లి,సెప్టెంబర్ 16 (భద్రాద్రిన్యూస్):-** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు పాటిస్తే వ్యవసాయంలో ఆశించిన లాభాలు సాధించవచ్చని నిరూపిస్తున్నారు గిరిజన దంపతులు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం బర్లగూడెం పంచాయతీకి చెందిన మాలోత్ విజయ-బాలు దంపతులు హార్టికల్చర్ అధికారి (ఏఈ) వేణు ప్రోత్సాహంతో పచ్చిమిర్చి సాగులో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. మేలైన పద్ధతులు అవలంబిస్తూ ఎకరానికి అధిక దిగుబడులు సాధిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**సాంకేతికతతో పెరిగిన పంటకాలం:**

అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాలు అందుబాటులోకి రావడంతో ఎకరాకు 12 నుండి 20 టన్నుల వరకు దిగుబడి సాధించే అవకాశం ఏర్పడింది. సాధారణంగా 6 నుంచి 7 నెలలకే పరిమితమయ్యే పంటకాలాన్ని డ్రిప్ సేద్యం, పాలీమల్చింగ్ సాంకేతికతల ద్వారా 250 నుంచి 280 రోజుల వరకు పొడిగించి నిరంతర దిగుబడులు పొందుతున్నారు. పాలీమల్చింగ్ వల్ల కలుపు నివారణ సులువై, నేలలో తేమ శాతం ఎక్కువ కాలం నిలుస్తోంది.

**వారానికో కోత.. పెరుగుతున్న పూత:**

పంట నాటిన 90 రోజులకు మొదటి కోత ప్రారంభమవుతుంది. ప్రతి వారం క్రమం తప్పకుండా కోత చేపట్టడం వల్ల కొత్త పూత, పిందెలు వచ్చి దిగుబడి గణనీయంగా పెరుగుతోందని రైతులు తెలిపారు.

**తొలి కోతల్లో:** ప్రారంభంలో తొలి 3 కోతల్లో ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది.

**తదుపరి దశలో:** పంట పుంజుకున్నాక ప్రతి కోతకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది.

ఆదాయం: మార్కెట్‌లో సరాసరిన కిలోకు ?20 చొప్పున ధర లభించినా సుదీర్ఘ పంటకాలం వల్ల నికర లాభాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సమగ్ర సస్యరక్షణే కీలకం:**

ఆకుముడతను ప్రాథమికంగా గుర్తించాలి: వేణు (హార్టికల్చర్ ఏఈ) "రసం పీల్చు పురుగుల వల్లే తోటల్లో వైరస్ త్వరితగతిన వ్యాపిస్తుంది. ప్రధానంగా ఆకుముడత తెగులును ప్రాథమిక



దశలోనే గుర్తిస్తే వైరస్ బెడదను పూర్తిగా అధిగమించవచ్చు. బిందు సేద్యంతో పాటు క్రమపద్ధతిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మిర్చిలో ఆశించిన లాభాలు సాధ్యమవుతాయి."

## లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో అవగాహన సదస్సు

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 16:**

సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి భూమిపై ఉన్న జీవరాశులను కాపాడే ఓజోన్ పొరను రక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం భూ, వాతావరణ శాస్త్రాల కేంద్రం ఆచార్యులు జి. కిషోర్ కుమార్ పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. అనుపమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య కిషోర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉపరితలం నుంచి 15 నుండి 35 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఓజోన్ పొర సూర్యుని హానికర కిరణాలను పీల్చుకుని సహజ రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. శీతలీకరణ యంత్రాల నుంచి వెలువడే రసాయనాల వల్ల ఓజోన్ పొరకు నష్టం జరుగుతోందని వీటికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వాయువులను, విద్యుత్ ఆదా చేసే పరికరాలను మాత్రమే వాడాలని సూచించారు. వాతావరణంలో పైపొరల్లో ఉండే ఓజోన్ మేలు చేస్తే మనం నివసించే భూమికి దగ్గరగా ఉండే పొరల్లో ఓజోన్ పెరిగితే అది వాయు కాలుష్యంగా మారి ఆరోగ్యాన్ని, పంటలను దెబ్బతీస్తుందని చెప్పారు. అడవుల నరికివేతను అరికట్టడం, మొక్కలు నాటడం, పునరుత్పాదక ఇంధన వనరులను వాడడం, ఒక్కసారి మాత్రమే వాడి పారేసే ప్లాస్టిక్‌ను నిషేధించడం వంటి చర్యలు చేపట్టాలని వివరించారు. అనంతరం ఓజోన్ పొర కాపాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, సరిత, శ్రీకాంత్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, బాలన్న విద్యార్థులు పాల్గొన్నారు.

## బొల్లారం విద్యుత్ శాఖ ఎఈగా రవీందర్

**పటాన్ చెరు, సెప్టెంబర్ 16:**



బొల్లారం డివిజన్ విద్యుత్ శాఖ ఎఈగా కె.రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన బొల్లారం డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం ఉద్యోగ భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో విద్యుత్ సమస్యలు పరిస్కరిస్తానని అన్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046